## పరిగి సివిల్ కోర్టు ఏజీపీగా బాల ముకుందం



ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ని కలిసిన ఏజీపీగా నియమకమైన బాలముకుందం

కులకచర్ల, జూలై 29: పరిగి సివిల్ కోర్టు ఏజీపీగా సీనియర్ న్యాయవాది చెలిమిల్ల బాల ముకుందం ముదిరాజ్ నియమితులయ్యారు. పరిగి ఏజీపీగా నియామకమైన ఆయన పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డిని సోమవారం పరిగి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. గతంలో 17 సంవత్సరాలు ఏజీపీగా పనిచేసిన ఆయన మూడు సంవత్సరాల పాటు ఇన్‌చార్జ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సేవ లందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి బాలముకుందాన్ని అభినందించారు.

## ఇచ్చిన హామీలను కాంగ్రెస్ వెంటనే నెరవేర్చాలి



సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు

కులకచర్ల, జూలై 29: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం ప్రహ్లాద్ రావు, కోటగిరి శివరాజ్ అన్నారు. భారతీయ జనతా పార్టీ కులకచర్ల మండల పార్టీ అధ్యక్షుడు జెమినీ సూర్యకాంత్ ఆధ్వర్యంలో మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల పథకాల గురించి బడ్జెట్లో ఊసే ఎత్తలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెంకటయ్య గౌడ్, మహి ళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్య వెంకటరామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గిరిగంటి కేశవులు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కాటన్ పల్లి అంజిలయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు గాదె మహిపాల్ ముది రాజ్, దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సంగ్యం శ్రీనివాస్, శంకర్ నాయక్, చౌడాపూర్ మండల అధ్యక్షులు సీహెచ్ బందయ్య పాల్గొన్నారు

### ఆందోళన విజయవంతం చేయాలి

కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ పేరుతో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధ మల్ల ఆనంద్ గౌడ్ పిలుపు మేరకు ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి, జోనల్ ఇన్‌చార్జి డాక్టర్.వెన్న ఈశ్వరప్ప లిపారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆనాటి ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

వికారాబాద్, జూలై29: మున్సిపల్ పరిధిలోని కొత్తగడి జడ్పీహెచ్ఎస్ 2003–04 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. కార్య క్రమంలో ఆనాటి హెచ్ఎం రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు అనంత్ రెడ్డి, నర్సింహారెడ్డి, సత్య నారాయణ రెడ్డి, నర్సింహులు, ఖాజాపాషా, స్వరూప , కిష్టయ్య , బురాన్ పాల్గొన్నారు.

## ప్రమాదరహిత వారోత్సవాల్లో
# పలువురికి సన్మానం



యాక్సిడెంట్ ఫ్రీగా బస్సు నడిపిన డ్రైవర్‌ను సన్మానిస్తున్న ఎస్ఐ అవినాష్‌రెడ్డి

పరిగి, జూలై 29: ప్రమాద రహిత వారోత్సవాలలో భాగంగా సోమవారం పరిగిలోని ఆర్టీసీ డిపోలో ఎలాంటి ప్రమాదాలు చేయకుండా సురక్షితంగా వాహనాలు నడిపిన పలువురు డ్రైవర్లను ఘనంగా సన్మానించారు. యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్లు ముగ్గురిని, లక్షే లక్ష్యం చాలెంజ్‌లో భాగంగా ఆదర్శ ఉద్యోగులను సన్మానించారు. కులకచర్ల ఎస్ఐ అవినాష్‌రెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం. కరుణశ్రీ, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

- కొడంగల్ సీఐ శ్రీధర్ రెడ్డి
- సైబర్‌నేరాలపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీధర్‌రెడ్డి

బొంరాస్పేట, జూలై 29: గ్రామాల్లో దొంగతనాలు జరగకుండా ముఖ్యమైన కూడళ్లలో, దుకాణాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కొడంగల్ సీఐ శ్రీధర్ రెడ్డి సూచించారు. మండలంలోని రేగడిమైలారంలో సోమవారం రాత్రి సైబర్ నేరాలు, దొంగతనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీసీ కెమెరాల వల్ల నేరానికి పాల్పపడిన వారిని గుర్తించవచ్చని అన్నారు. అదేవిధంగా గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్లకు పంపించే లింకులను ఓపెన్ చేసి బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్ కార్డు నెంబర్ తదితర వివరాలు చెప్పరాదని సీఐ వివరించారు. ప్రతి ఒక్కరు వాహనాలు నడిపే సమయంలో రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ పోలీసులు పాల్గొన్నారు.

## ఆలయానికి విరాళం..దాతలకు సన్మానం



కులకచర్ల, జూలై 29: మండల కేంద్రంలో నిర్మిస్తున్న శివాలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన వడ్ల రాజశేఖర్ కుటుంబ సభ్యులు రూ. 10వేల విరాళం అందజేశారు. విరాళాన్ని అందించిన వారిని శివాలయ నిర్మాణ కమిటీ సభ్యులు ప్రకాశ్, చెంద్రయ్య, శంకర్ సన్మానించారు

## రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం



మరమ్మతులో భాగంగా సీసీ వేస్తున్న దృశ్యం

పరిగి, జూలై 29: పరిగి మున్సిపాలిటీలోని జాతీయ రహదారి నుంచి 13, 14 వార్డులకు వెళ్లే రహదారి వర్షానికి కోతకు గురై గుంతలమయంగా మారింది. దీంతో మున్సిపాలిటీ ఆధ్వ ర్యంలో సోమవారం రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. ఇందులో భాగంగా గుంతలమయంగా మారిన రోడ్డును సీసీ వేసి మరమ్మతు చేయించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎ.క్రిష్ణ, తాహెర్‌అలీ, మహ్మద్ మాజిద్, సర్వర్ అహ్మద్, అన్వర్, హమీద్ పాల్గొన్నారు.



# సైకిల్ పెట్రోలింగ్ ప్రారంభం

### విజిబుల్ పోలీసింగ్‌ను పెంచుతూ సత్వర సేవలు అందిస్తాం
### రాచకొండ సీపీ సుధీర్‌బాబు

సిటీబ్యూరో, జూలై 29 (నమస్తే తెలంగాణ): ప్రజలకు సత్వర సేవలు అందించడమే లక్ష్యంగా విజిబుల్ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తూ కొత్తగా సైకిల్ పెట్రోలింగ్‌ను ప్రారంభించామని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు తెలిపారు. పోలీస్‌స్టేషన్ల పరిధిలో బ్లూకోల్ట్స్, పెట్రోకార్‌తో పాటు కొత్తగా సైకిల్ పెట్రోలింగ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

ఈ మేరకు ఒక్కో పోలీస్‌స్టేషన్‌కు 3 నుంచి 5 సైకిళ్లను పంపిణీ చేయడంతో సోమవారం నుంచి సిబ్బంది సైకిల్ పెట్రోలింగ్ మొదలు పెట్టారని వెల్లడించారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో స్థానిక ఠాణా సిబ్బంది ఆయా ప్రాంతాల్లో సైకిళ్ల ద్వారా పెట్రోలింగ్ చేస్తూ విజిబుల్ పోలీసింగ్‌ను మరింత పెంచాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు పోలీసుల సేవలను మరింత చేరువ చేయడంలో భాగంగా పెట్రోలింగ్‌ను ముమ్మరంగా నిర్వహిస్తున్నామన్నారు. క్షేత్ర స్థాయి విధి నిర్వహణలో మహిళా సిబ్బంది పాత్రను పెంచుతూ వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తున్నామని, దాంతో ఉత్సాహంగా బ్లూకోల్ట్స్, పెట్రో కార్, సైకిల్ పెట్రోలింగ్ విధుల్లో వారు భాగస్వాములవుతున్నారని సీపీ అభినందించారు. మహిళలకు రక్షణగా షీ టీమ్స్ పనిచేస్తున్నాయని, చిన్నారులు, వృద్ధులపై నేరాలకు పాల్పడే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. డయల్ 100, 112కు ద్వారా వచ్చే ఫిర్యాదులపై వేగంగా స్పందిస్తున్నామని తెలిపారు.

# ఎస్సీ వర్గీకరణపై మందకృష్ణ మౌనం వీడాలి

- 8, 9న జంతర్ మంతర్ వద్ద మహాధర్నా
- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి



ఖైరతాబాద్, జూలై 29: ఎస్సీ వర్గీకరణపై ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ మౌనం వీడాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాజీ జేఏసీ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2014లో కేం ద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే వర్గీకరణ చేస్తామన్నారని, రెండోసారి వచ్చిన తర్వాత కూడా ఆ అంశాన్ని పక్కన పెట్టారన్నారు. తాజాగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోనూ వర్గీకరణ పేరుతో మరోసారి మభ్యపెట్టారన్నారు. మందకృష్ణ మాదిగ బీజేపీకి మాదిగల ఓట్లు వేయించారని, వారి ఓట్లతోనే రాష్ట్రంలో ఎనిమిది సీట్లు గెలిచిందన్నారు. ప్రస్తుతం, పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న తరుణంలో వర్గీకరణ బిల్లును ఎందుకు పెట్టడం లేదన్నారు. మాదిగల ఓట్లు వేయించుకున్న ఇక్కడి బీజేపీ ఎంపీలు సైతం మౌనం వహిస్తున్నారని ఆరోపించారు. పార్లమెంట్ సమావేశాల్లోపు వర్గీకరణ బిల్లు పెట్టకుంటే ఆగస్టు 8, 9 తేదీల్లో జంతర్ మంతర్ వేదికగా, పెద్ద ఎత్తున మాదిగలతో కలిసి మహాధర్నా, నిరసనలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలను ఆహ్వానిస్తామన్నారు. సమావేశంలో మాదిగ రాజకీయ పోరాట వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఒక్కలగడ్డ చం ద్రశేఖర్, జాతీయ దళిత సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు బుదాల బాబు రావు, మాదిగ రాజకీయ పోరాట సమితి జాతీయ అధ్యక్షులు బీఎన్ రమేశ్, మాదిగ శక్తి వ్యవస్థాపక అధ్యక్షులు బొంకూరి సురేందర్ సన్నీ, మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడ్డ యాదయ్య, తెలంగాణ దళిత దండు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మొగులయ్య, బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేశ్, మాదిగ జేఏసీ యూత్ అధ్యక్షులు మహేశ్, విజయలక్ష్మి, సముద్రాల ప్రశాంత్, దేవరకొండ నరేశ్, జోగు గణేశ్, లింగంపల్లి మధుకర్, కృష్ణ పాల్గొన్నారు.

## ఉద్యోగ బదిలీలను చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు డాక్టర్ వైద్యనాథ్

చిక్కడపల్లి, జూలై 29: తెలంగాణ వ్యవసాయ శాఖలో దీర్ఘకాలికంగా వేచి చూస్తున్న ఉద్యోగుల బదిలీలను వెంటనే చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వైద్యనాథ్ అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం కార్యవర్గ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు వైద్యనాథ్ మాట్లాడుతూ, జీవో ఎంఎస్–80 ప్రకారం, నిష్పక్ష పాతంగా బదిలీలు చేపట్టాలని దీర్ఘకాలికంగా మండలాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది ఎదురుచూస్తున్నారని తెలిపారు. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండే విధంగా బదిలీలు నిర్వహించాలని ఆయన కోరారు. ప్రధాన కర్యాదర్శి కృపాకర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన చెందిన జిల్లా అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## చెట్టును ఢీ కొట్టిన కారు.. ఒకరి మృతి, పలువురికి గాయాలు

శామీర్‌పేట, జూలై 29 : దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా కారు చెట్టును ఢీకొట్టగా ఒకరు మృతి చెందగా పలువురికి గాయాలైన సంఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రామ చంద్రాపురానికి చెందిన రాజేశ్వర్‌రావు తన కుటుంబ సభ్యులతో కలసి కొమరవెల్లి దేవాలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా తుర్కపల్లి గ్రామ పరిధిలోని అచాయిపల్లి చెక్ పోస్టు సమీపంలో కారు రోడ్డుకు ఎడమ వైపున ఉన్న చెట్టును ఢీకొట్టింది. కారు నడుపుతున్న రాజేశ్వర్‌రావుతో పాటు భార్య విజయలక్ష్మి, కొడుకు ప్రవీణ్, కూతురు ప్రవళిక, అల్లుడు ప్రవీణ్‌లకు బలమైన గాయాలు కావడంతో దవాఖానకు తరలించగా రాజేశ్వర్ రావు మృతి చెందారు.

## ట్రాన్స్‌ఫార్మర్‌పై పడ్డ చిన్నారులు.. గాయాలు

సుల్తాన్‌బజార్, జూలై 29: వేప చెట్టు ఎక్కే క్రమంలోట్రాన్స్‌ఫార్మర్‌పై పడిన ఇద్దరు చిన్నారులకు తీవ్రగాయాలైన సంఘటన సోమవారం బేగంబజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీభవన్ వెనుక భాగంలో ఉన్న పటేల్‌నగర్ బస్తీకి చెందిన మహ్మద్ సాబేర్ కుమారుడు రహమాన్, షేక్‌పాషా కుమారుడు జాహెద్ పటేల్‌నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద ఉన్న వేప చెట్టు ఎక్కే క్రమంలో పక్కనే గోడను ఎక్కుతున్న సమయంలో గోడను ఆనుకొని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై పడ్డారు. షార్ట్ సర్క్యూట్‌కు గురైన చిన్నారులు తీవ్ర గాయాల పాలయ్యారు. వైద్య చికిత్స నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ,జూలై 29: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వేస్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(45)ఆదివారం రాత్రి ఫలక్‌నామ–ఉందానగర్ రైల్వేస్టేషన్‌ల మధ్య పట్టాలు దాటుతుండగా ఎదురుగా వచ్చిన రైలు ఢీకొనడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## జల్సాలకు అలవాటు పడి చోరీలు

కాచిగూడ, జూలై 29: జల్సాలకు అలవాటు పడి, చెడు వ్యసనాలకు బానిసై తాళం వేసిన ఇండ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న యువకుడిని కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్,ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం... గోల్నాక వెంకటేశ్వరనగర్ ప్రాంతానికి చెందిన మధుసూదనాచారి కుమారుడు వడ్లూరి ఆకాశ్ డెకరేషన్ వర్క్ చేస్తాడు. వెంకటేశ్వరనగర్ ప్రాంతానికి చెందిన అక్షయ్ మేకలను అమ్ముకొని శనివారం రాత్రి ఇంట్లో రూ.60 వేలు దాచిపెట్టాడు. ఆకాశ్ ఇంట్లోని నగదును తీసుకుని పారిపోయాడు. అక్షయ్ ఫిర్యాదు మేరకు ఆకాశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

## స్వదేశానికి..
# జువైనల్ చిన్నారుల అప్పగింత

సైదాబాద్, జూలై 29 : సైదాబాద్ బాలుర సదనం (జువైనల్)లో ఉన్న ఐదుగురు చిన్నారులను సోమవా రం తెలంగాణ బాలుర సదనం అధికారులు బంగ్లాదేశ్‌కు అప్పగించారు. గత జనవరి 27వ తేదీన బంగ్లాదేశ్‌కు చెందిన ఐదుగురు చిన్నారులను ఖమ్మం పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. వారిని ప్రశ్నించగా తాము జీవనోపాధి కోసం వచ్చామని తెలుపడంతో వారిని ఓ స్వచ్ఛంద సేవ సంస్థకు అప్పగించారు. విచారణ చేపట్టిన జిల్లా బాలుర సంరక్షణ మండలి అధికారులు చిన్నారులను సైదాబాద్‌లోని బాలుర సదనం (జువైనల్)కు తరలించారు. చిన్నారులను బంగ్లాదేశ్‌కు పంపాలని రాష్ట్ర సెక్రటరీ కరుణ వాకటి, కాంతి వెస్లీ నిర్ణయించటంతో సోమవారం రెడ్ రోప్ క్రిస్టోలేట్ స్వచ్ఛంద సేవ సంస్థ సహకారంతో వారిని స్వదేశానికి పంపారు. ఐదు నెలల అనంతరం చిన్నారులను పంపించామని జువైనల్ డిపార్టుమెంట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మిర్జా అలీబేగ్, బాలుర సదనం సూపరింటెండెంట్ నాగమల్ల నాగేశ్వరరావు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ అజీజ్ నగర్, మొయినాబాద్ రోడ్ గేటెడ్ కమ్యూనిటీ విల్లాలో పని చేయుటకు లేడీ సెక్యూరిటీ గార్డ్స్/జెంట్స్ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం: నెలకు 17,000/– ప్లస్ ESI, PF. వయస్సు: 20 నుండి 35 సంవత్సరాల లోపు. టెన్త్ పాస్, హైట్: 5.5''. సెల్: 8919606707 / 9848328701.
NT-98041

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## నీటిగుంతలో పడి
# బాలుడి మృతి

జగద్గిరిగుట్ట, జూలై29: క్వారీ నీటిగుంతలో పడి బాలుడు మృతి చెందిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్‌లో సల్మాన్ భార్యతో కలిసి నివాసముంటున్నాడు. ముగ్గురు సంతానం కాగా చిన్న కుమారుడు అర్మాన్(9) స్థానిక మదరసా స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం కొందరు పిల్లలతో కలసి బస్తీ సమీపంలో ఉన్న క్వారీ నీటి గుంతలో స్నానానికి వెళ్లాడు. నీటిలో దిగిన అర్మాన్ ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. మిగతా పిల్లలు బస్తీ వాసులకు సమాచారం ఇచ్చారు. స్థానికుల సహాయంతో బయటకు తీయగా అప్పటికే చనిపోయాడు. ఎస్ఐ రంజిత్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించి మృతదేహాన్ని గాంధీ దవాఖాన తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సిగరెట్ పీకలు పడేయద్దన్నందుకు
# కానిస్టేబుల్‌పై దాడి

వెంగళరావునగర్, జూలై 29 : కాల్చిన సిగరెట్ పీకలు తమ ఇంటి ముందు పడేయద్దన్నందుకు ముగ్గురు బ్యాచిలర్స్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన ఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని సిద్ధార్థనగర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..సిద్ధార్థనగర్‌లోని ప్రశాంత్ అపార్ట్‌మెంట్ లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో కానిస్టేబుల్ సాగర్ తన తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నారు. తల్లిదండ్రులు హైమ,సమ్మయ్య అదే అపార్ట్‌మెంట్ లో వాచ్‌మెన్లుగా పని చేస్తుంటారు. పక్కన ఉన్న అపార్ట్‌మెంట్‌లోని రెండో ఫ్లోర్‌లో ముగ్గురు బ్యాచిలర్స్ ఉంటున్నారు. వారు రోజు మద్యం తాగి కాల్చిన సిగరెట్ పీకల్ని గ్రౌండ్ ఫ్లోర్‌లో నివాసం ఉండే కానిస్టేబుల్ ఇంటి బాల్కనీలో విసిరి పడేస్తున్నారు. సిగరేట్లు కాల్చి తమ ఇంటి ముందు పడేయవద్దని ఎన్నోమార్లు చెప్పినా వారు వినిపించుకోలేదు. దీంతో కానిస్టేబల్ తల్లి హైమ పక్క భవనం వాచ్‌మెన్ దస్తయ్యకు ఫిర్యాదు చేసింది. ఆ విషయం తెలుసుకున్న ముగ్గురు బ్యాచిలర్స్ హైమను అసభ్య పదజాలంతో దూషించారు. తనకు జరిగిన అవమానంపై డ్యూటీ నుంచి ఇంటికి తిరిగొచ్చిన కానిస్టేబుల్ సాగర్ కు చెప్పుకుని బోరున విలపించింది. తన తల్లిని ఎందుకు దూషించారంటూ ఆ బ్యాచిలర్స్ వద్దకు వెళ్లి కానిస్టేబుల్ సాగర్ ప్రశ్నించాడు. కోపోద్రిక్తులైన ముగ్గురు యువకులు కానిస్టేబుల్ పై దాడి చేశారు. కానిస్టేబుల్ చొక్కా చించేసి కొట్టి గాయపర్చారు. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ : 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962